నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI


జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల, నాయకులు సుధాకర్, దూదిమెట్ల, రాజీవ్‌సాగర్

జిట్టాకు కన్నీటి వీడ్కోలు

తెలంగాణ ఉద్యమ కెరటం మరణంతో శోక సంద్రంలో భువనగిరి

తెలంగాణ ఉద్యమ కెరటం దివికేగింది.. స్వరాష్ట్ర సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా రణభేరీ చేసిన రణన్నినాథుడు నేలకొరిగింది. మన సంస్కృతి, మన కట్టుబొట్టు, భాష, యాస అని నినదించిన తెలంగాణ గొంతుక ఆగిపోయింది.. యువతను ఏకం చేసి ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన యువ గళం మూగబోయింది.. ఆపదలో అన్న అనగానే ఆదుకునే పేదోళ్ల వేగుచుక్క నేలరాలింది. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఆస్తులను తెగనమ్మి.. నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన గుండె నిట్టూర్చింది.

ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. గత కొంత కాలంగా బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడి శుక్రవారం ఉదయం 11.47 గంటలకు తుదిశ్వాస విడిచారు. దీంతో భువనగిరితోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా శోకసంద్రంలో మునిగిపోయింది.

- సందర్శనార్థం ఫామ్ హౌస్‌లో పార్థివ దేహం
- పలువురు నేతల నివాళి.. కుటుంబ సభ్యులకు ఓదార్పు
- మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి నివాళి
- కడసారి చూపుకోసం పెద్దఎత్తున తరలివచ్చిన జనం
- తీవ్ర ఉద్వేగానికి లోనైన బంధువులు, కుటుంబ సభ్యులు
- పాడె మోసిన చామల, కుంభం, పైళ్ల శేఖర్ రెడ్డి
- పట్టణం మీదుగా బొమ్మాయిపల్లి వరకు అంతిమ యాత్ర

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డికి అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. శుక్రవారం ఉదయం మరణించిన తర్వాత హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో భువనగిరి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అభిమానులు, బంధువులు, కుటుంబ సభ్యుల సందర్శనార్థం ఆయన ఫామ్ హౌస్‌లో పార్థివ దేహాన్ని ఉంచారు. ఈ సందర్భంగా పలువురు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిట్టా కుటుంబ సభ్యులను ఓదార్చారు. దాంతో జిట్టా ఫామ్‌హౌస్ పెద్ద ఎత్తున తరలివచ్చిన జనంతో నిడిపోయింది. ఎక్కడ చూసినా తండోపతండాలుగా వచ్చిన జనమే కనిపించారు. ఈ క్రమంలో బాలకృష్ణారెడ్డి అంతిమ యాత్రకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం తర్వాత ఆయన పార్థివ దేహాన్ని పూలతో అలంకరించి వైకుంఠ రథం పైకి చేర్చారు. పుష్పాంజలి ఘటించిన కుటుంబ సభ్యులు, అభిమానులు పార్థివ దేహం ఫామ్‌హౌస్ నుంచి కదిలి వెళ్తుండగా ఒక్కసారిగా ఉద్వేగానికి లోనయ్యారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జిట్టా పాడె మోశారు. అటు నుంచి అంతిమ యాత్ర ప్రారంభమై.. పట్టణం మీదుగా జిట్టా సొంతూరైన భువనగిరి మండలంలోని బొమ్మాయిపల్లి వరకు కొనసాగించారు. ఆయన అభిమానులు, నేతలు వాహనం ముందు నడిచారు. అనంతరం బొమ్మాయిపల్లి వైకుంఠధామంలో ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. ఆయా మార్గాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యింది.

విషణ్ణ వదనంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

జిట్టా బాలకృష్ణారెడ్డి అంతిమ యాత్రకు హాజరైన నాయకులు, జనం

జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి,నాయకులు గొంగిడి మహేందర్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి కోమటిరెడ్డి

నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పల్లె రవికుమార్

జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళి అర్పిస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆవేదనలో అభిమానులు

జిట్టా మరణవార్తతో భువనగిరితోపాటు ఆలేరు నియోజకవర్గాల ప్రజలు శోక సంద్రంలో మునిగిపోయారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆవేదనకు గురయ్యారు. ఎక్కడ చూసినా జిట్టా మరణ వార్త గురించే చర్చించుకున్నారు. అందరినీ ప్రేమ, ఆప్యాయతలతో మాట్లాడే వ్యక్తి, మంచి గుణం ఉన్న ప్రజానేత మరణ వార్తతో కంటనీరు పెట్టుకుంటున్నారు. భువనగిరికి ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. భువనగిరితోపాటు తెలంగాణ వ్యాప్తంగా జిట్టా ఉద్యమ ప్రస్తానం, పోరాటాన్ని నెమరువేసుకున్నారు.

కోమటిరెడ్డి, హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి నివాళి

జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్ రెడ్డి వేర్వేరుగా జిట్టా పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీలు కోదండరాం, తీన్మార్ మల్లన్న, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, గొంగిడి మహేందర్ రెడ్డి, చెరుకు సుధాకర్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జిట్టా పార్థివ దేహానికి నివాళులర్పించారు.

జిట్టా అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించాలని ఆందోళన

భువనగిరి కలెక్టరేట్ : ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన అభిమానులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను అడ్డుకున్నారు. జిట్టా పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు వచ్చిన మంత్రిని బాలకృష్ణారెడ్డి అభిమానులు అడ్డుకొని నినాదాలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో చివరి వరకు పోరాటం చేసిన, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన జిట్టా అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించి సముచిన గౌరవం కల్పించాలని కోరారు. అంతకు ముందు తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద జిట్టా అభిమానులు నిరసన వ్యక్తం చేసి అధికారి లాంఛనాలతో అంత్యక్రియలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పోరాట యోధుడు.. తెలంగాణ గొంతుక జిట్టా

- స్వరాష్ట్రం కోసం కొట్లాడిన ఉద్యమ కెరటం
- గల్లీ నుంచి ఢిల్లీ దాకా అనేక సమస్యలపై పోరాటం
- భువనగిరిలో జిట్టా బాలకృష్ణారెడ్డిది ప్రత్యేక ప్రస్థానం

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమంతోపాటు అనేక పోరాటాలు చేశారు జిట్టా బాలకృష్ణారెడ్డి. సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్ని వర్గాల ప్రజలు ఆయన చేసిన సేవలను గుర్తుకు చేసుకొని కన్నీంటి పర్యంతమవుతున్నారు.

- పూర్తి పేరు : జిట్టా బాలకృష్ణారెడ్డి
- పుట్టినరోజు : 14-12-1972
- తల్లిదండ్రులు : దివంగత రాధమ్మ - బాల్ రెడ్డి (రిటైర్డ్ టీచర్)
- భార్య : సునీత
- పిల్లలు : వివేకానందరెడ్డి, ఝాన్సీ
- సోదరి : జి. జ్యోతి - సుధీర్ రెడ్డి, రాధేష్ (అమెరికా)
- విద్యార్హతలు : బీకాం
- జన్మస్థలం : బొమ్మాయిపల్లి, భువనగిరి మున్సిపాలిటీ

చేపట్టిన పదవులు

- 1992 : వివేకానంద యువజన సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి
- 1997 : రంగారెడ్డి జిల్లా యువజన సంఘాల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు
- 1997 : ఫౌండర్ మెంబర్, చైర్మన్ రామాలయం, హుడా కాంప్లెక్స్, కొత్తపేట, హైదరాబాద్
- 2000 : యువజన సంఘాల సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు
- 2002 : యువజన సంఘాల సమితి నార్త్ అమెరికా ఏర్పాటు.. గౌరవాధ్యక్షుడిగా ఎన్నిక
- 2003 : టీఆర్ఎస్ పార్టీలో చేరిక
- 2007 : టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక
- 2010 : వ్యవస్థాపక కన్వీనర్‌గా యువ తెలంగాణ జేఏసీ ఏర్పాటు.. యువ తెలంగాణ పార్టీగా మార్పు
- 2022 : ఫిబ్రవరిలో యువ తెలంగాణ పార్టీని బీజేపీలో విలీనం

ఒకే వేదికపైకి 10వేల యువజన సంఘాలు..

జిట్టా బాలకృష్ణారెడ్డి వివేకానందుడి స్ఫూర్తితో ఓ కెరటంలా ఎగిసిపడ్డారు. యువజన సంఘాలన్నింటినీ కలిపి.. రాష్ట్ర స్థాయిలో యువజన సంఘాల సమితిని ఏర్పాటు చేసి 10వేల సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. యువతను చైతన్య పరిచి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించడంతో పాటు, వివేకానంద, నేతాజీ, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఏర్పాటు చేయించారు. జిట్టా బాలకృష్ణారెడ్డి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2005లో జాతీయ ఉత్తమ యువజన సేవా పురస్కారం అందించింది.

ఎన్నో సేవా కార్యక్రమాలు

జిట్టా రాజకీయాల్లోకి రాక ముందే అనేక సేవా కార్యక్రమాలు చేశారు. తన మేనమామ, ప్రవాస భారతీయుడు డాక్టర్ చిలుముల రాంచంద్రారెడ్డి ఫౌండేషన్ సాయంతో 2003లోనే వారి అమ్మమ్మ తాత పేర్లతో చిలుముల శివరాజిని నారాయణరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించారు. పేద విద్యార్థులు ఆకలితో అలమటించకుండా ఈ కాలేజీలోనే అయిదేళ్ల పాటు ఉచితంగా తన సొంత డబ్బులతో మధ్యాహ్న భోజనం అందించారు. ఇక జిట్టా తల్లి పేరు పైన జిట్టా రాధమ్మ ఫౌండేషన్ ఏర్పాటు చేసి.. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ఫ్లోరైడ్ ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

గ్రామాల్లో తాగునీరు కొనుక్కోలేక, కలుషిత జలాలతో అనారోగ్యం పాలై చర్మవ్యాధులు, గర్భస్రావాలు జరుగుతున్న పరిస్థితులను గమనించిన జిట్టా.. మూసీ పరీవాహక గ్రామాల్లో సురక్షిత తాగునీరు అందించాలనే ఆలోచనకు వచ్చి వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 2006 సంవత్సరంలోనే భువనగిరి నియోజకవర్గంలోని 106గ్రామాల్లో మూడున్నర కోట్ల రూపాయలు వెచ్చించి వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అప్పటిదాకా మంచినీటి కోసం ఒక్కో క్యాన్‌ను రూ.40 వెచ్చించి కొనుగోలు చేసిన భువనగిరి ప్రాంత ప్రజలకు కేవలం రూ. 2లకే ఒక క్యాన్ నీటిని అందించారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో జిట్టా బాలకృష్ణారెడ్డి

ఢిల్లీ ఎర్రకోట వరకు తెలంగాణ జాతర..

తెలంగాణ జాతరలు, సంబురాలను భువనగిరి ఖిల్లా నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు నిర్వహించారు. మొదటి సారిగా 2007 ఫిబ్రవరిలో భువనగిరిలో తెలంగాణ సంస్కృతి, వంటకాలు, పండుగలపై తెలంగాణ జాతర నిర్వహించారు. జాతర సభలో తెలంగాణలో మొదటిసారిగా కేసీఆర్‌కు గొర్రెపిల్ల, గొంగడిని బహూకరించి గొల్ల కురుమల ప్రాధాన్యతను చాటారు. 2007 మార్చిలో నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో తెలంగాణ సంబురాలు, 2010లో ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ గ్రౌండ్‌లో తెలంగాణ నుంచి గంగిరెడ్లు, కమ్మరి కొలిమి, కుమ్మరి సారె, వడ్రంగి, చేనేత మగ్గం, చేతివృత్తుల పనిముట్లు, కోయ, డప్పు, డోలు, చిందు, యక్షగానం, బోనాలు, బతుకమ్మ వివిధ కళారూపాలతో పాటు కళాకారులను ఢిల్లీకి తీసుకెళ్లారు. తెలంగాణ వంటకాలను ప్రదర్శించారు. తెలంగాణ జాతర సందర్భంగా భువనగిరి ఖిల్లాను విద్యుత్ వెలుగులతో నింపారు.

ఉద్యమంలో గెలిచి.. రాజకీయంలో ఓడి..

యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న జిట్టా బాలకృష్ణారెడ్డి 2003లో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. 2004లోనే భువనగిరి అసెంబ్లీ టికెట్ ఇస్తామని పార్టీ అధినేత కేసీఆర్ హామీ ఇవ్వగా.. దివంగత సీనియర్ నేత అలె నరేంద్ర భువనగిరి నుంచి పోటీ చేయడంతో జిట్టా టికెట్ త్యాగం చేశారు. 2009లో జరిగిన వివిధ రాజకీయ పరిణమాల నేపథ్యంలో టీఆర్ఎస్‌కు దూరమయ్యారు. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 43,720 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి తన ఉనికి చాటారు. 2009 ఎన్నికల తర్వాత దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. డిసెంబర్ 23న తెలంగాణ ప్రకటన వెనక్కి తీసుకోవడంతో జిట్టా ఆ పార్టీకి అనివార్యంగా రాజీనామా చేశారు. 2014 ఎన్నికల్లో యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీ చేయగా 39,270 ఓట్లు వచ్చాయి. 2018 ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2022 ఫిబ్రవరిలో యువ తెలంగాణ పార్టీని బీజేపీలోకి విలీనం చేశారు. అనంతరం అక్కడి నుంచి కాంగ్రెస్‌లో చేరినా.. భువనగిరి టికెట్ దక్కే అవకాశం లేకపోవడంతో 14 ఏండ్ల తర్వాత తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఓడినా.. ఆస్తులమ్ముకున్నా.. వెనక్కి చూడలే..

జిట్టా బాలకృష్ణారెడ్డి మూడు సార్లు వరుస ఓటములు చవి చూసినా ఏనాడూ కుంగిపోలేదు. ఆస్తులు అమ్ముకుని ఆర్థికంగా దెబ్బ తిన్నా.. గుండె ధైర్యం వీడలేదు.. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా పోరాటాలు కొనసాగించారు. ఉద్యమాలే ఊపిరిగా.. పోరాటాలే పంథాగా ఎంచుకుని.. ప్రజల కోసం రాత్రింబవళ్లు పని చేశారు. అంతకు ముందు యువ తెలంగాణ జేఏసీని ఏర్పాటు చేశారు. తెలంగాణ రణభేరి, తెగదెంపుల సంగ్రామం పేరుతో తెలంగాణ ప్రాంత జిల్లాల్లో భారీ బహిరంగ సభలు, సదస్సులు ఢిల్లీలో తెలంగాణ జాతర నిర్వహించి ఉద్యమ స్ఫూర్తిని విస్తరింపజేశారు. సాగరహారం, మిలియన్ మార్చ్, రైల్ రోకో, రాస్తారోకో, వంటావార్పు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు.

అనేక సమస్యలపై పోరుబాట..

ప్రజా సమస్యలపై జిట్టా నిరంతర పోరాట చేస్తూనే ఉన్నారు. మూసీపై రసాయన శుద్ధి కార్మాగారం ఏర్పాటు చేయాలని, పల్లె పల్లెకు సురక్షిత జలాలు, కృష్ణా జలాలు అందించాలని వారం రోజుల పాటు పాదయాత్ర చేశారు. 2005 ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకు వలిగొండ నుంచి హైదరాబాద్ వరకు వివిధ గ్రామాల్లో పర్యటించారు. మూసీ పరిరక్షణ సమితితో కలిసి 200 కిలోమీటర్ల మేర జిట్టా పాదయాత్ర చేశారు. రూ.350 కోట్లు రసాయన శుద్ధి కర్మాగారం కోసం విడుదల అయ్యేట్టు చేయగలిగారు. నిమ్స్‌ను కాపాడడం ద్వారా ఎయిమ్స్ వచ్చేందుకు కారకుడయ్యారు. నిమ్స్ ఉద్యమంలో భాగంగా మూడు రోజులు జైలుకు కూడా వెళ్లారు. సీసీఎంబీ ఏర్పాటు కోసం కూడా పోరాటం చేశారు. మూసీ నది పరీవాహక ప్రాంతాలకు కృష్ణా జలాలు అందివ్వాలన్న డిమాండ్‌తో భువనగిరి నియోజకవర్గంలో 2008లో 350 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. ప్రభుత్వ విధానాలపై, గల్ఫ్ కార్మికుల సమస్యలపై, కళాకారుల సమస్యలపై, పోతిరెడ్డిపాడుపై, ప్రైవేట్ కంపెనీల్లో స్థానికులకు 80శాతం రిజర్వేషన్ కోసం, బస్వాపురం భూనిర్వాసితుల కోసం, అసైన్డ్ భూముల విషయంలో, ఫార్మా కంపెనీల వల్ల చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ పరిసర ప్రాంతాలు విషతుల్యం అవుతుండడంతో వాటిపై నియంత్రణ కోసం పోరాటం చేశారు. బునాదిగాని కాల్వ, పిలాయిపల్లి కాల్వ, బొల్లేపల్లి కాల్వ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని ఉద్యమించారు.

విఘ్నేశ్వరాయ నమః

- నేడు వినాయక చవితి
- విగ్రహాల ప్రతిష్ఠకు వాడవాడలా ముస్తాబైన మండపాలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

తొలి పూజలందుకునే వినాయకుడి పండుగ వచ్చేసింది. నవరాత్రోత్సవాల సంబురాలు తెచ్చింది. నేడు వినాయక చవితి సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి లంబోధరుడి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మార్కెట్లలో గణేశ్ విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి. పూజకు కావాల్సిన పూలు, పండ్లు ఇతర సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మట్టి గణపతి విగ్రహాలకే జనం మొగ్గు చూపుతున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశాయి. నేటి నుంచి ప్రత్యేక పూజలు, భక్తిపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామాలు, పట్టణాలు కోలాహలంగా మారనున్నాయి. జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి వెలుగులు నిండాలని, ప్రకృతి కరుణించి, మహా గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

జాతీయ శిబిరంలో ఎంజీయూ ఖ్యాతి చాటాలి

- ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి

రామగిరి, సెప్టెంబర్ 6: ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన వలంటీర్లు సత్తాచాటి ఎంజీయూ ఖ్యాతి నిలుపాలని ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.మద్దిలేటి సూచించారు. శుక్రవారం ఎంజీయూలో నిర్వహించిన ఎంపికకు ఉమ్మడి జిల్లాలోని వలంటీర్లు రావడంతో వారికి పలు అంశాలల్లో ఇంటర్వ్యూలు నిర్వహించిన ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి బెంగళూరులో నిర్వహించే శిబిరానికి పంపిస్తున్నట్లు వెల్లడించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన వలంటీర్లుతో కోఆర్డినేట్ డాక్టర్ పి.మద్దిలేటి

ఎంపికైన వలంటర్లు వీరే..

- పురుషుల విభాగంలో-పి.శివప్రసాద్ -ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నల్లగొండ, ఆర్.రంగసాయి-ఎంజేపీటీబీసీడబ్ల్యూ-సాగర్, ఎస్.బన్నీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నార్కట్‌పల్లి, విష్ణువర్ధన్-ప్రభుత్వ జూనియర్ కళాశాలత నారాయణ్‌పూర్, నాగార్జున ప్రభుత్వ జూనియర్ కళాశాల, భూదాన్ పోచంపల్లి

మహిళా విభాగంలో..

ఎన్.నందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల సంస్థాన్ నారాయణ్‌పూర్, ఐ.రూప ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు దేవరకొండ, కె.అంజలి టీఎస్ఎంఎస్ జూనియర్ కళాశాల గుర్రంపోడు, ఐ.నందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల భూదాన్ పోచంపల్లి, అక్షర ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు దేవరకొండ.

26 నుంచి ఎంజీయూ ఎంఈడీ, బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

రామగిరి, సెప్టెంబర్ 6 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈడీ, బీఈడీ కళాశాలలో చదివే విద్యార్థులకు సెమిస్టర్-2 రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 26నుంచి అక్టోబర్ 7వరకు నిర్వహించనున్నట్లు సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను శుక్రవారం ఆయన ఎంజీయూలో విడుదల చేశారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.